# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-11-2025** | **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చడంలో మీడియా రంగం భాగం కావాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.**

2. **ప్రజాస్వామ్యాన్ని సంరక్షించడంలో రాజ్యాంగానిది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈరోజు పర్యటించనున్నారు.**

4. **ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఒడిశా ముఖ్యమంత్రిని కోరారు.**

5. **హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**

==========================

దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చడానికి జాతి నిర్మాణంలో మీడియా రంగం భాగం కావాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో గత సాయంత్రం నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతితో పాటు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, కె. రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ, సామాజిక మాధ్యమాల యుగంలో అవాస్తవ సమాచారానికి దూరంగా మీడియా పారదర్శకతను కొనసాగించాలని అన్నారు.

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆంధప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతిలో నిన్న సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణగవాయ్, రాష్ట్ర హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో పాటు పలువురు

ప్రముఖులు హాజరయ్యారు. సదస్సుని ఉద్దేశించి బి.ఆర్. గవాయ్ ప్రసంగిస్తూ, రాజ్యాంగం ఆధారంగా ప్రాథమిక హక్కుల సంరక్షణకు కోర్టులు దోహదపడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని సంరక్షించడంలో రాజ్యాంగానిది కీలక పాత్ర అని తెలిపారు. రాజ్యాంగం అందరికి సమాన హక్కులు అందిస్తుందన్నారు. సమానహక్కుల కల్పన ద్వారా సమాజంలో ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈరోజు పర్యటించనున్నారు. ఈ ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కర్నూలు విమానా శ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్లో బయలుదేరి పిన్నాపురంలోని గ్రీన్ కో సంస్థకు చేరుకుంటారు. అక్కడ గ్రీన్ కో – సోలార్ పవర్ ప్రాజెక్టును హెలికాప్టర్ ద్వారా పరిశీలించనున్నారు. అనంతరం పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సు ద్వారా 12 రంగాల్లో 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహక చర్యలతో ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెరిగాయని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి కృషితో వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఏడాది కాలంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో 3సార్లు పర్యటించి, 2.80 లక్షల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారని అన్నారు. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల తొలిసారిగా విశాఖ పట్నంలో కృత్రిమ మేధ హబ్ నిర్మించనుందని చెప్పారు.

-----------------------------

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని కోరారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని అల్లూరి జిల్లా లగిసపల్లలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రితో కలిసి ఆమె నిన్న పాల్గొన్నారు. సరిహద్దుల్లోని 21 గ్రామాల ప్రజలు అక్కడి అధికారుల తీరుతో ఇబ్బందులు పడుతున్నారని... వారి సమస్యలు తీర్చాలని ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి కోరుతూ,

వాయిస్ .. 33 సెకన్లు

-----------------------------

కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలు, శ్రీశైలం, తెలంగాణాలోని వేములవాడ, రామప్ప, కీసర గుట్ట వంటి శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామునుంచే కృష్ణా,

గోదావరి స్నాన ఘట్టాల్లో కార్తీకమాస స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

---------------------------

హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతమని, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్‌సిటీలో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్-2025 ఏర్పాట్లను పలువురు అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా, 2047 నాటికి తెలంగాణ ఏ విధంగా ఉండనుందనే విషయాన్ని డాక్యుమెంట్ ద్వారా వివరించనున్నామని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చే పారిశ్రామికవేత్తలకు వివరిస్తామని తెలిపారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పంజాబ్ కేసరి లాలా లజపత్ రాయ్ వర్ధంతి ఈ రోజు. పంజాబ్‌లోని మోఘా జిల్లా ధుడీకే గ్రామంలో 1865 జనవరి 28వ తేదీన జన్మించిన ఆయన బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్తో కలసి లాల్-బాల్-పాల్ త్రయంలో ఒకరుగా ప్రసిద్ధి చెందారు. 1928లో భారతదేశ పర్యటనకు వచ్చిన సైమన్ కమిషన్ ను వ్యతిరేకిస్తూ లాలా లజపత్‌రాయి చేసిన ఆందోళన బ్రిటిష్ ఇండియా చరిత్రలో చాలా ప్రముఖమైంది.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో అత్యల్పంగా 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రాత్రి నమోదైంది.

=====================